క్లుప్తంగా

బీచ్ క్లీనింగ్



జూ సాగర్ గేటు ఎదురుగా తీరంలో శుభ్రం చేస్తున్న జూ సిబ్బంది, వలంటీర్లు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆధ్వర్యంలో గురువారం మహా సముద్రాల దినోత్సవం సందర్భంగా కోస్టల్ క్లీనప్ కార్యక్రమం చేపట్టారు. జూ సాగర్ గేటు ఎదురుగా సముద్ర తీరంతో పాటు సాగర్‌నగర్ వద్ద తీరంలో శుభ్రం చేశారు. సముద్రాలను రక్షించుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జూ, అటవీశాఖ సిబ్బందితో పాటు నగరంలో పలు స్వచ్ఛంద సంస్థల నుంచి వలంటీర్లు పాల్గొని చెత్త సేకరించి పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించారు.

రేపు ఉపన్యాసం, క్విజ్ పోటీలు

బీచ్‌రోడ్డు: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉమెన్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శనివారం ఉపన్యాసం, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పి.కె.ఎం. లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కార మార్గాలు' అంశంపై మూడు నిమిషాల పాటు ఉపన్యాసం ఇవ్వవలసి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పర్యావరణం అంశంపై క్విజ్ పోటీలను నిర్వహిస్తామని తెలియజేశారు. బీచ్ రోడ్డులోని యూత్ హాస్టల్స్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు 99490 24249 నంబరుకు ఫోన్ చేసి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వలంటీర్లు సమాజ సేవకులు



వలంటీర్లను సత్కరిస్తున్న అక్కరమాని

ఏయూక్యాంపస్: వలంటీర్లు సమాజ సేవకులని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. స్థానిక 20వ వార్డులోని నాలుగు సచివాలయాల పరిధిలో వలంటీర్లను గురువారం సత్కరించారు. నిబద్ధతతో పని చేస్తూ వలంటీర్లు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నారన్నారు. వారి సేవలను గుర్తిస్తూ సత్కరించడం, వారికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మువ్వల సురేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

15 మంది కానిస్టేబుళ్లకు బదిలీ

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో 15 మంది కానిస్టేబుళ్లకు బదిలీ జరిగింది. నగరంలో పలు పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న 372 కానిస్టేబుళ్లను బదిలీ చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న వారిలో 15 మందిని ఆనందపురం, పీఎంపాలెం, గాజువాక, 2, 3 పట్టణ పోలీస్ స్టేషన్లు, ఎంవీపీ, భీమిలి తదితర పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. వారి స్థానంలో పలు స్టేషన్ల నుంచి బదిలీలపై కొందరు కానిస్టేబుళ్లను ఇక్కడ నియమించారు. నాలుగు రోజుల క్రితం హెడ్ కానిస్టేబుళ్ల బదిలీల్లో కూడా ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు హెచ్‌సీలకు వేర్వేరు స్టేషన్లకు బదిలీ చేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని సీతారామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో 21 మంది దంపతులతో స్వామి ఆలయంలో మాలధారణ చేశారు. అలాగే విష్వక్సేన పూజ, హోమ ప్రతిష్ట, వినాయక పూజ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రజలు మురిసేలా..

- శరవేగంగా 17వ వార్డులో అభివృద్ధి పనులు
- రూ.29.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- రూ.48 లక్షలతో కమ్యూనిటీ హాల్ పనులు
- రూ.16 లక్షలతో ఫుట్‌పాత్ నిర్మాణం



బీటీ రోడ్డు, ఫుట్‌పాత్ నిర్మించనున్న ప్రాంతం

ప్రజల బాగోగులు చిత్తశుద్ధితో పట్టించుకునేదే ప్రజా ప్రభుత్వం. 17వ వార్డులో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూస్తే ఆ సంగతి తెలుస్తుంది. డ్రైనేజీ పనులు, రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాలు ఆధునికీకరణతో పాటు మరెన్నో పనులకు ఈ వార్డులో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకారం చుట్టి వేగంగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. గతంలో లేని అభివృద్ధి వార్డులో జరుగుతున్న వైనం చూస్తున్న ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ వార్డులో జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అనేక ఆధునికీకరణ పనులు పూర్తి చేసింది. ఆదర్శనగర్‌లో డ్రైనేజీ పనులు, కమ్యూనిటీ హాల్ ఆధునికీకరణతో పాటు వార్డులోని అనేక రహదారుల్లో బీటీ రోడ్ల నిర్మాణం జరిగింది. స్థానిక కార్పొరేటర్ అభ్యర్థన మేరకు ఈ వార్డులో మరిన్ని అభివృద్ధి పనులకు జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.94 కోట్లతో ఆయా పనులు చేపట్టనున్నారు. ఇటీవల ఆయా పనులకు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకటరావు, స్థానిక కార్పొరేటర్ గేదెల లావణ్య శంకుస్థాపన చేయగా మరో వారంలో ఆయా పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నాయి.

రూ.94 కోట్లతో అభివృద్ధి పనులు

17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య అభ్యర్థన మేరకు జీవీఎంసీ సుమారు రూ.94 కోట్లు విలువ చేసే ఆయా పనులకు పచ్చజెండా ఊపింది. ఈ పనుల్లో భాగంగా వార్డులోని దళైవారి వీధిలో రూ.48 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నారు. స్థానికుల అవసరాలకు అనుగుణంగా దీనిని అందుబాటులోకి తేనున్నారు. దీంతో పాటు వార్డులోని ఉషోదయ కూడలి నుండి టీటీడీ కూడలి వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరగనుంది. రూ.29.50 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో పాటు అదే రోడ్డును ఆనుకుని రూ.16 లక్షల వ్యయంతో ఫుట్‌పాత్ నిర్మాణ పనులు సైతం చేపట్టనున్నారు. స్థానికులు, పాదచారులతో పాటు వాహనచోదకుల అవసరాలకు అనుగుణంగా ఆయా పనులు జరగనున్నాయి. నిర్దేశించిన పనులన్నీ పూర్తయితే వార్డు రూపురేఖలు మరింత మారతాయని, ఉషోదయ కూడలి ఆధునికతను సంతరించుకుంటుందని స్థానికులు చెబుతున్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సిద్ధం చేసిన ఖాళీ స్థలం

శరవేగంగా పూర్తి చేస్తాం..



17వ వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టాం. ఇటీవల మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. బీటీ రోడ్డు నిర్మాణం, ఫుట్‌పాత్‌తో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జీవీఎంసీ అనుమతిచ్చింది. దళైవారి వీధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం స్థానికుల చిరకాల స్వప్నం. దాన్ని మరికొన్ని నెలల్లో సాకారం చేయనున్నాం. దీంతో పాటు ఫుట్ పాత్ నిర్మాణంతో ఉషోదయ కూడలి మరింత ఆధునికతను సంతరించుకోనుంది. ఆయా పనులు చేపట్టేందుకు ఇటీవల శంకుస్థాపన చేశాం. మరికొన్ని రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. పనులన్నీ శరవేగంగా పూర్తి చేయించి సౌకర్యాలను వార్డు ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– గేదెల లావణ్య, 17వ వార్డు కార్పొరేటర్

సముద్రాలను సంరక్షించాలి



తీరప్రాంతంలో ప్లాస్టిక్‌ను ఏరివేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఏయూక్యాంపస్: సముద్రాలను సంరక్షించాల్సిన బాధ్యతను యువత గుర్తించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బీచ్ రోడ్డులో తీరప్రాంత శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలసి తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను ఏరివేశారు. ఏయూ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులతో పాటు నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన జాతీయ సేవా పథకం వలంటీర్లు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆర్.కె బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగర తీరంలో పేరుకుపోయిన దాదాపు 55 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులతో కలసి ఏరివేసి, జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఆర్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



15వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

మద్దిలపాలెం: మౌలిక వసతుల కల్పనలో భాగంగా జీవీఎంసీ 15వ వార్డులో రూ.87.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెంకోజీపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతి వార్డును మోడల్‌గా తీర్చిదిద్దనున్నామన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వార్డులో అభివృద్ధి పనులతో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య మాట్లాడుతూ వార్డులో 87.70 లక్షల వ్యయంతో వెంకోజీపాలెం, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి పనులు ప్రారంభించారన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వహణ ఇంజినీరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘ కార్యాలయం ప్రారంభం



భవన నిర్మాణ కార్మికుల సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న గోవింద్

మద్దిలపాలెం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, వాటి పరిష్కారానికి పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యుడు పడాల గోవింద్ అన్నారు. ఇసుకతోట జంక్షన్‌లో జిల్లా బిల్డింగ్ పరంజి వర్కర్స్ యూనియన్ నూతన భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే కార్మిక శాఖాధికారులకు, స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సాయిబాబా, గంగ్రెడ్డి సతీష్, లక్ష్మణ్‌రెడ్డి, కలిశెట్టి భాస్కరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

మేధోహక్కుల పరిరక్షణలో కాపీరైట్స్ కీలకం



సదస్సులో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్తంగా 'ఏఐ జెనరేటెడ్ వర్క్స్– ఆథర్‌షిప్ అండ్ ఓనర్‌షిప్ అండ్ ద కాపీరైట్ యాక్ట్, 1957 అంశంపై ఒకరోజు జాతీయ వెబినార్ నిర్వహించింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రచయితలు, కళాకారులు, డిజైనర్లు, కంపోజర్లు, ఇతర సృజనాత్మక వ్యక్తుల కాలాన్ని, మేధస్సును పరిరక్షించే దిశగా ప్రత్యేక హక్కులు అవసరాన్ని తెలియజేశారు. ఏఐ, చాట్ జీపీజీ, చాట్ బోట్ వంటి నూతన సాంకేతికతల ఆవిర్భావంతో ఎదురయ్యే కాపీరైట్ చట్టాలు అవసరం, నూతన సవాళ్లను వివరించారు. అనంతరం భారత ప్రభుత్వ రిజిస్ట్రార్స్ ఆఫ్ కాపీరైట్ పూర్వ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి.ఆర్. రాఘవేంద్ర మాట్లాడుతూ నూతనంగా ఏఐ సాంకేతికత ఆవిర్భావంతో ఎదురయ్యే సవాళ్లు, చట్టపరమైన అంశాలను విపులీకరించారు.

డీపీఐఐటీ–ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ సదస్సుకు 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 862 మంది విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయవాదులు, ఐపీ నిపుణులు హాజరయ్యారని తెలిపారు. కాపీరైట్ చట్టం, ఏఐ జనరేటెడ్ వర్క్స్ తదితర అంశాలు మానవ జీవితంపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయి అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా జ్ఞానాన్ని సృష్టించిన వారికి, ఆవిష్కరణలు చేసిన వారికి కొన్ని ప్రత్యేకమైన చట్టాలు ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మేధో హక్కుల పరిరక్షణలో కాపీరైట్ చట్టం ఉపయోగాన్ని తెలియజేశారు.

నోడల్ ఏజెన్సీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: విభిన్న ప్రతిభావంతులకు ఉపయుక్తంగా పునరావాస కేంద్రం ఏర్పాటుకు అవసరమైన నోడల్ ఏజెన్సీ స్థాపనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సూచనలతో విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల సేవలు అందించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

దివ్యాంగుల కోసం పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ, ప్రభుత్వయేతర స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు ఈ నెల 17వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు. వివరాలకు www.socialjustice.gov.in వెబ్‌సైట్‌లో గాని పెదవాల్తేరులోని రాణి చంద్రమణి దేవి ఆసుపత్రి ఆవరణలో ఉన్న సహాయ సంచాలకుల కార్యాలయంలో గాని, 0891–2952585 ఫోన్ నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

'సీఎం జగన్‌పై పూర్తి విశ్వాసం ఉంది'

ఎంవీపీకాలనీ: నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చే విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 11 శాఖల్లో విధులు నిర్వహిస్తున్న 10 వేలకు పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ముఖ్యమంత్రి జగన్‌తో పాటు మంత్రి బొత్సకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయానికి మరింత మందికి ఉద్యోగ భరోసా కల్పించాలని, మిగత శాఖల్లోని కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆయన కోరారు.

మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఆశగా ఎదురు చేస్తున్నారన్న ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నోటిఫికేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తారనే నమ్మకం ఉందన్నారు. ఈ అంశంపై మంత్రి బొత్స సత్యనారాయణను కలవగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరారు. గతంలో లక్షకు పైగా సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేసిన ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీతో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగుల మనసు గెలుచుకోవాలని ఆకాంక్షించారు.

కిడ్నీ వ్యాధులపై పరిశోధనలకు హెచ్‌ఎంఎస్ సహకారం

- ప్రముఖ నెఫ్రాలజిస్ట్, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ రవిరాజ్



అమెరికాలో హెచ్‌ఎంఎస్ వైద్యులతో డాక్టర్ రవిరాజ్

మహారాణిపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ వ్యాధులపై చేస్తున్న పరిశోధనలకు అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూలు (హెచ్‌ఎంఎస్) సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకొచ్చిందని ప్రముఖ నెఫ్రాలజిస్టు, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి, విశ్రాంత డీఎంఈ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న డాక్టర్ రవిరాజ్ హార్వర్డ్ మెడికల్ స్కూలును సందర్శించారు. అక్కడి నెఫ్రాలజీ విభాగం ఆహ్వానం మేరకు అమెరికా వెళ్లిన ఆయన ఉద్దానం కిడ్నీ వ్యాధులపై తాను చేస్తున్న పరిశోధనలకు సహకారం అందించాలని కోరారు. దీనికి హెచ్‌ఎంఎస్ నెఫ్రాలజీ విభాగం నుంచి సానుకూల సంకేతాలు అందాయి.

ప్రభుత్వం అనుమతి ఇస్తే పలాసలో కొత్తగా నిర్మిస్తున్న కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో వారి సహకారం ఉపయోగించుకోవచ్చని డాక్టర్ రవిరాజ్ తెలిపారు. 1995 నుంచి 2000 మధ్యలో ఉద్దానం నుంచి కేజీహెచ్‌కు ఎక్కువ కిడ్నీ బాధితులు వచ్చేవారని ఆయన తెలిపారు. దీంతో ఉద్దానం వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. తమ పరిశోధనలో అక్కడి ప్రజల్లో 18.5 శాతం మంది కిడ్నీ బాధితులు ఉన్నారని గుర్తించామన్నారు. సాధారణంగా షుగర్, బీపీ వంటి వ్యాధుల వల్ల కిడ్నీ సమస్యలు వస్తాయని, కాని ఉద్దానంలో అలాంటి సమస్యల వల్ల రాలేదన్నారు. నీరు, ఆహారం, మెటల్స్, భూమిని పరీక్షించామని, ఆయా పరీక్షల్లో కిడ్నీ జబ్బులు రావడానికి గల కారణాలు తెలియలేదన్నారు.

ఈ నేపథ్యంలో హెచ్‌ఎంఎస్ సహకారంతో చేసే పరీక్షలతో పాటు జన్యు పరిశోధనలు కీలకం కానున్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ బులెటిన్‌లో ఉద్దానం కిడ్నీ వ్యాధులపై తాము చేసిన పరిశోధన పత్రం ప్రచురితమైందని తెలిపారు.

చిల్లర దొంగలతో చికాకు

పోలీసులు నిఘా వేసి పట్టుకోవాలని రామకృష్ణాపురం వాసుల అభ్యర్థన



పెట్రోల్ అపహరణకు దొంగలు తీసుకొచ్చి వదిలేసిన బాటిల్ (బైక్ సమీపంలో)

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా రామకృష్ణాపురంలో చిల్లర దొంగల బెడద పెరిగిపోయింది. ఆటోలు, ద్విచక్ర వాహనాలలో పెట్రోల్ అపహరణ, వాటి విడి భాగాలు పట్టుకుపోవడం చేస్తున్నారు. దీంతో దొంగలను పట్టుకోవడానికి రాత్రిళ్లు నిద్రపోకుండా స్థానికులు కాపలా కాస్తున్నారు. బుధవారం రాత్రి దొంగతనానికి వెళ్లిన ఓ యువకుడిని పట్టుకుని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. ఈ కాలనీలో దొంగలు కొద్ది రోజులుగా ఇళ్లముందు నిలిపిన ఆటోలు, ద్విచక్రవాహనాల సీట్లు, వాటి విడి భాగాలు, పెట్రోల్ తీసుకుపోతున్నారు. కొన్నిసార్లు ఇళ్లలో కూడా చొరబడుతున్నారు. మంగళవారం రాత్రి రెండు ఆటోల్లోని ఇంజన్లు తొలగించి పట్టుకుపోయారు. దీంతో బుధవారం రాత్రి కాలనీలో కొందరు యువకులు దొంగలను పట్టుకోవడానికి నిద్రపోకుండా కాపలా కాశారు. ప్రతి రోజు మాదిరిగా బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తొమ్మిది మంది కాలనీలోకి ప్రవేశించారు. ఎప్పట్లాగే ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాల వద్ద పెట్రోల్ తీయడానికి వారు వెంట తీసుకొచ్చిన ఖాళీ వాటర్ బాటిళ్లు సిద్ధం చేశారు. అప్పటికే అక్కడ కాపలా ఉన్న గ్రామస్తులు దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించారు. గ్రామస్తులను గమణించిన దొంగలు పరుగు తీశారు. అయినా వారిని వదలకుండా గ్రామస్తులు వెంటబడి వారిలో ఒక యువకుడిని పట్టుకున్నారు. మిగిలిన వారు దొరక్కుండా గ్రామస్తులపై తిరగబడి రాళ్లు, గాజు సీసాలు విసిరారు. పట్టుబడిన యువకుడిని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. పోలీసులు రాత్రిళ్లు నిఘా పెట్టి దొంగతనాలు అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని రామకృష్ణాపురం వాసులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి సదస్సు రేపు

దాబాగార్డెన్స్: శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలో భారతీయతలో–అమృతకాలం అనే అంశంపై ఈ నెల 10, 11 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు ప్రోగ్రామ్ కన్వీనర్ ఎస్. రాధాకుమారి తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్ డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరగనున్న సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఆచార్యులు పాల్గొని జ్యోతిష్యం, ఆరాధ్య వ్యవస్థ, ఆలయ వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, శిక్షణ వ్యవస్థ, ఆధ్యాత్మికత–భారతీయత, ఆర్థ వ్యవస్థ ఇలా అనేక అంశాలపై ప్రసంగిస్తారన్నారు.

పిస్తోల్ కేసులో చురుగ్గా విచారణ

సీతమ్మధార : మహారాష్ట్ర నుంచి పిస్తోల్‌ను ఒడిశాకు తరలిస్తున్న శ్రీధర్ వారికిషన్ పతాంగిని ఫోర్తుటౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అలాగే పిస్తోల్ ఇచ్చి పంపించిన మహారాష్ట్రలోని జలానా జిల్లాకు చెందిన దత్తపవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ ఒకే చోట ఉంచి గురువారం విచారణ చేపట్టారు. అసలు పిస్తోల్ ఎవరు ఇచ్చారు..?, ఎక్కడి నుంచి వచ్చింది..? అన్న కోణంలో ఆరా తీశారు. అయితే ఈ ఇద్దరూ చెప్పిన మాటలకు పొంతన లేకపోవడంతో దత్త పవర్‌ని ప్రత్యేకంగా విచారించారు. సందీప్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు దత్త పవర్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసులో రోజుకో కొత్త పేరు వెలుగులోకి రావడం పోలీసులకు తలనొప్పిగా మారింది. గతంలో ఆత్మరక్షణ కోసమని చెప్పి... ప్రస్తుతం సందీప్ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఆ వ్యక్తిపై పోలీసులు దృష్టి సారించారు. అసలు పిస్తోళ్లు ఎవరు సరఫరా చేస్తున్నారు అన్న కోణంలో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు ఏఈవో నరసింహరాజు, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బాలకార్మికుడికి విముక్తి

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్, లేబర్ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో బాలకార్మికులను గుర్తించేందుకు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీంట్లో భాగంగా ఆనందపురంలో దాడులు నిర్వహించి ఒక బాలుడిని రక్షించి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇప్పటి వరకు 17 మంది బాలబాలికలను రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీపీ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో చేస్తున్న దుర్మార్గపు ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 847వ రోజు, గురువారం స్టీల్‌ప్లాంట్‌లోని ఆర్ఎంహెచ్‌పీ, ఎస్ఎంఎస్, హెచ్ఆర్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.